క్లుప్తంగా

గుడిసెల తొలగింపు



గుడిసెలను తొలగిస్తున్న దృశ్యం

పెనుకొండ: పట్టణంలోని మడకశిర రోడ్డులో ప్రభుత్వ భూమిలో సీపీఎం ఆధ్వర్యంలో వేసుకున్న గుడిసెలను సబ్‌కలెక్టర్ కార్తీక్ నేతృత్వంలో పోలీసులు మంగళవారం తొలగించారు. ప్రభుత్వ భూమిని ఎవరైనా ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయించారు. డీఎస్పీ హుస్సేన్‌పీరా, సీఐ కరుణాకర్, సిబ్బంది పాల్గొన్నారు. అయితే గుడిసెల తొలగింపును వ్యతిరేకిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేశారు.

నేటి నుంచి 'నా భూమి - నా దేశం'

అమరాపురం: మండలంలో బుధవారం నుంచి నిర్వహించే నా భూమి నా దేశం కార్యక్రమాన్ని అధికారులు ప్రజా ప్రతినిధులతో కలసి విజయవంతం చేయాలని ఎంపీడీఓ మునిస్వామి కోరారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయం కార్యదర్శులతో సమావేశమై పలు సూచనలు, సలహాలిచ్చారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న వైస్‌చైర్మన్ జబీవుల్లా

హిందూపురం: స్థానిక ఎంజీఎం గ్రౌండ్‌లో వైఎస్సార్ వార్డు వలంటీర్ క్రికెట్ టోర్నమెంట్‌ను వైస్‌చైర్మన్ జబీవుల్లా మంగళవారం ప్రారంభించారు. ఈనెల 14వ తేదీ వరకు జరిగే టోర్నీలో 8 టీములు పోటీపడుతున్నాయి. జిల్లాలో మొదటిసారిగా హిందూపురంలో వలంటీర్లకు క్రీడలు నిర్వహించడం హర్షణీయమని వైస్‌చైర్మన్ అన్నారు.

మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి

రొళ్ల: మంగళవారం మండల పరిధిలోని బాజయ్యపాళ్యం, ఆర్.గొల్లహట్టి ప్రాథమిక పాఠశాలలను ఎంఈఓ-1 మోహన్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలలో రికార్డులు తనిఖీ చేసి విద్యార్థుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. మెను ప్రకారం భోజనాన్ని వడ్డించే విధంగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించండి



వైద్యులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ మంజువాణి

గుడిబండ: ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓ మంజువాణి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గుడిబండ, మద్దనకుంట గ్రామాల్లో మిషన్ ఇంద్ర ధనస్సు కార్యక్రమాన్ని పరిశీలించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

చిలమత్తూరు: మండలంలోని 44వ నంబరు జాతీయ రహదారి కొడికొండ చెక్‌పోస్ట్‌లో మంగళవారం అక్రమంగా మద్యం తరలిస్తున్న పెనుకొండకు చెందిన నారాయణనాయక్ సెల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 48 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

పాదయాత్రకు సంఘీభావం



పాదయాత్రకు మద్దతు తెలుపుతున్న గోరంట్ల వైఎస్సార్‌సీపీ నాయకులు

గోరంట్ల: ప్రకాశం జిల్లా వైఎస్సార్‌సీపీ నాయకుడు షేక్ జిలాన్ బాషా సీఎం వైఎస్ జగన్‌కు మద్దతుగా చేపట్టిన ప్రజా సంక్షేమ పాదయాత్ర మంగళవారం గోరంట్లకు చేరింది. జిలాన్‌బాషా నేతృత్వంలోని 8 మంది సభ్యులు మార్కాపురం నుంచి శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వరకు పాదయాత్ర చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మండల వైఎస్సార్‌సీపీ నాయకులు వారికి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సహకార బ్యాంక్ డైరెక్టర్ పాటూరి శంకరరెడ్డి, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు డాక్టర్ బాషా, నాయకులు రంగారెడ్డి, నాగేనాయక్, అతావుల్లా, సుధాకర్‌రెడ్డి , విజయసింహారెడ్డి, సోముశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్లు నిల్

అమరాపురం: మండలంలోని నిద్రగట్ట గ్రామ పంచాయతీ పరిధిలోని 4వ వార్డు సభ్యుని ఎన్నికకు సంబంధించి మంగళవారం నామినేషన్లు రాలేదని ఆర్‌ఓ. భాస్కర్ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో జలధి

లేపాక్షి/రొద్దం: హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో చిన్న పీర్ల పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. ఇందులో భాగంగానే లేపాక్షి మండలంలోని సోమిరెడ్డిపల్లి, మామిడిమాకులపల్లి గ్రామాలతో పాటు రొద్దంలో మంగళవారం సాయంత్రం జలధి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లోని యువకులు అగ్ని గుండం చుట్టూ అలావ్ తొక్కుతూ చూపర్లను ఆకట్టుకున్నారు. పీర్ల ఊరేగింపు తర్వాత జలధికి తరలించారు.



రొద్దం: పీర్లను జలధికి తరలిస్తున్న దృశ్యం



లేపాక్షి: పీర్ల స్వాములను ఊరేగిస్తున్న దృశ్యం



రొద్దం: ప్రధాన వీధిలో భక్తుల సందడి



లేపాక్షి: అలావ్ తొక్కుతున్న యువకులు

కరియమ్మదేవీ నమోస్తుతే !



అలంకరణలో కరియమ్మదేవి

అగళి: మండల పరిధిలోని ఆలుడి గ్రామంలో వెలసిన కరియమ్మదేవి ఆలయంలో అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అగళి పరిసరాలలో పాటు కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

కన్యకా పరమేశ్వరికి పూజలు

అమరాపురం: మండల కేంద్రంలోని వాసవీ కన్యాకాపరమేశ్వరి అమ్మవారికి అధిక శ్రావణ మాసం నాల్గవ మంగళవారం సందర్భంగా ఆర్యవైశ్యులు పూజలు నిర్వహించారు. అర్చకులు హరీష్ భట్టాచార్యులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపించారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే శంకర నారాయణ



సోమందేపల్లిలో గడప గడపకూ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకరనారాయణ

సోమందేపల్లి: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర నారాయణ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక స్నేహలతనగర్, ద్వారకామయినగర్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలును వివరిస్తూ లబ్ధికి సంబంధించి బుక్‌లెట్ అందజేశారు. వైఎస్సార్ చేయూత, అమ్మఒడి తదితర పథకాలతో పాటు ప్రతి నెలా 1వ తేదీనే ఇంటికే పింఛన్ పంపిస్తూ ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఎమ్మెల్యేతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీ సభ్యులు సిఫార్సు చేసిన వారికే పథకాలు అందేవన్నారు. కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆధ్వర్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని తెలిపారు. ఇంకా అర్హత ఉండి సాంకేతిక కారణాలతో పథకాలు అందకపోతే సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రతి పేదవాడికి పక్కా గృహం ఉండాలన్న సంకల్పంతో జగనన్న కాలనీల పేరిట ఊర్లకు ఊళ్లు వెలుస్తున్నాయని చెప్పారు. ఇదే కాలనీలలో గత పాలకులు కనీసం రోడ్లు కూడా నిర్మించలేదని విమర్శించారు. అయితే తమ ప్రభుత్వ హయాంలో సీసీ రోడ్లు నిర్మించామన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నాగరాజురావు, వెస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, మాజీ కన్వీనర్ వెంకటరత్నం, జెడ్పీటీసీ సభ్యుడు అశోక్, వైస్ సర్పంచ్ వేణు, ఎస్సీసెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గజేంద్ర, నాయకులు గాజుల శీన, అంజి, మహబూబ్ బాషా, బ్రహ్మచారి, రాజు, రాహుల్, మరిగమ్మ, మాజీ సర్పంచ్ కంబాలప్ప, ఎంపీటీసీ ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మికి ప్రత్యేక పూజలు



రొళ్ల: రత్నగిరి గ్రామంలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీ దేవికి మంగళవారం ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

ఎట్టకేలకు అంత్యక్రియలు పూర్తి



మృతుడు శ్రీనివాస్ (ఫైల్)

పావగడ: పట్టణ వ్యాప్తంగా కొరచ శ్రీనివాస్ (30) మృతి సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. రెండు రోజులుగా శ్రీనివాస్ భౌతికకాయానికి అంత్యక్రియలు నిర్వహించకుండా కుటుంబ సభ్యులు నిరసన తెలియజేశారు. శ్రీనివాస్ మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అయితే సీఐ అజయ్ సారథి ప్రత్యేక చొరవతో బందోబస్తు మధ్య సోమవారం రాత్రి అర్ధరాత్రి చాకలికుంట దగ్గర అంత్యక్రియలు నిర్వహించడంతో ఉద్రిక్తతకు తెర పడింది. కుటుంబ సభ్యులకు పోలీసులు నచ్చజెప్పడంతో ఏ ఇబ్బందులు తలెత్తకుండా ప్రశాంతంగా అంత్యక్రియలు పూర్తయ్యాయి. మృతుని భార్య నాగరత్నమ్మ వారి పిల్లలు, తల్లితండ్రుల రోదనలు అందరినీ కంట తడి పెట్టించింది.

వేగంగా విద్యుద్దీకరణ పనులు



పల్లా లాడ్జి సమీపంలో పోల్స్ మారుస్తున్న దృశ్యం

హిందూపురం అర్బన్: పట్టణంలోని రైల్వేరోడ్డు విస్తరణ పనులు జోరుగా జరుగుతున్నాయి. ఇప్పటికే రహమత్‌పూర్ నుంచి బాలాజీ సర్కిల్ వరకు రోడ్డు వెడల్పు పనులు చేస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ ప్రత్యేక చొరవ తీసుకొని డ్రైన్ పనులను 80 శాతం పూర్తి చేయించారు. విద్యుత్ స్తంభాలు, నియంత్రికలు మార్చేందుకు విద్యుత్‌శాఖ అధికారులకు రూ.47 లక్షల చెల్లించాల్సి ఉంది. అందులో మొదటి విడతగా రూ.11.98 లక్షలు చెల్లించడంతో విద్యుత్ పోల్స్ మార్చే పనిని ఆశాఖ వారు యుద్ధప్రాతిపదికన చేస్తున్నారు. రహమత్‌పూర్ నుంచి స్టేట్ బ్యాంక్ వరకు ఈ రోడ్డు పనులు జరుగుతుండగా పల్లా లాడ్జి వరకు పోల్స్ మారుస్తున్నారు.

కొడిగెనహళ్లిలో వ్యక్తి ఆత్మహత్య



రమణ (ఫైల్)

పరిగి: మండల పరిధిలోని కొడిగెనహళ్లిలో మంగళవారం సాయంత్రం రమణ (60) అనే వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. ఎస్ఐ నరేంద్ర తెలిపిన వివరాల మేరకు... రమణ నాయీ బ్రాహ్మణ వృత్తి చేసుకుంటూ జీవనం సాగించేవారు. అయితే కొన్ని సంవత్సరాల క్రితమే ఆయన భార్య చనిపోయింది. అప్పటి నుంచి మనస్తాపంతో మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలోనే జీవితంపై విరక్తి చెంది తన ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని కుమారుడు రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేంద్ర తెలిపారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

రొళ్ల: కుటుంబ కలహాలతో నింగమ్మ (40) అనే వివాహిత పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వివరాల్లోకి వెళితే మండల పరిధిలోని కొడగార్లగుట్ట కాలనీలో నివాసం ఉంటున్న లక్ష్మప్ప భార్య నింగమ్మ కుటుంబ కలహాలతో పొలం వద్ద నేరేడు పంటకు ఉపయోగించే పురుగుల మందు సేవించింది. కుటుంబ సభ్యులు ఆమెను మడకశిర ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగ ఉన్నట్లు సమాచారం. ఆమెకు ఇద్దరు కుమారులు అశోక్, శ్రీనివాస్ ఉన్నారు.



నింగమ్మను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

గ్రామాల అభివృద్ధే లక్ష్యం



చిలమత్తూరు: సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పురుషోత్తమరెడ్డి



గోరంట్ల: మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ప్రమీల

- ఎంపీపీలు ప్రమీల, పురుషోత్తమరెడ్డి
- ప్రశాంతంగా గోరంట్ల, చిలమత్తూరు మండల సర్వసభ్య సమావేశాలు

గోరంట్ల: మండలంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించి గ్రామాలను అభివృద్ధి చేయడమే లక్ష్యమని ఎంపీపీ ప్రమీల తెలిపారు. ఇందులో ఆయా శాఖల అధికారులు కూడా అంకిత భావంతో పనిచేయాలన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ ప్రమీల అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ నేతృత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం కులమత రాజకీయాలకు అతీతంగా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. అదేవిధంగా అభివృద్ధికి పెద్ద పీటవేస్తున్నామన్నారు. అధికారులు అంకిత భావంతో పనిచేసి ప్రభుత్వ పథకాలు పేదలకు సక్రమంగా అందే విధంగా కృషిచేయాలని పేర్కొన్నారు. ఆయా శాఖల పరిధిలో జరుగుతున్న అభివృద్ధిని సంబంధిత శాఖల అధికారులు సమావేశంలో వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు పాతే జయరాంనాయక్, తహసీల్దార్ రంగనాయకులు, ఎంపీడీఓ రఘునాథగుప్తా, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు బాషా తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు: మండలంలోని గ్రామాలన్నింటికీ రహదారులు నిర్మించడమే లక్ష్యమని ఎంపీపీ పురుషోత్తమరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో తమ్మినాయినపల్లి, మధురేపల్లి, ఎస్. ముద్దిరెడ్డిపల్లి, కమ్మయ్యగారిపల్లి గ్రామాలకు రహదారులు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ గ్రామాలకు రోడ్డు ఏర్పాటు చేసే బాధ్యతను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక తీసుకున్నారన్నారు. ముఖ్యంగా తమ్మినాయపల్లి రహదారికి ఏళ్ల క్రితం అప్పటి టీడీపీ ప్రభుత్వంలో భూమి పూజ చేసి వదిలేశారని, తాము అలా కాదని ఒకేసారి ప్రారంభోత్సవం చేసి చూపుతామన్నారు. వెలుగు కార్యాలయంలో మరుగుదొడ్ల నిర్మాణాలు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. వీరాపురంలో పశువుల ఆస్పత్రిలో వైద్యుడిని నియమించాలని సర్పంచ్ లక్ష్మీపతిరెడ్డి కోరారు. కంబాలపల్లి, మధురేపల్లిలకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని సర్పంచ్ మురళీమోహన్ కోరారు. తహసీల్దార్ నాగరాజు మాట్లాడుతూ మండలంలో 12 చోట్ల ఎస్సీ, ఎస్టీలకు శ్మశాన వాటికలు కేటాయించామని, కావాల్సిన వారు వినతిపత్రం అందజేస్తే ఉన్నతాదికారులకు తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరేష్‌కృష్ణ, సీడీపీఓ రెడ్డిరమణమ్మ, వివిధశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు

- 28 కేజీల గంజాయి, 25 గ్రాముల మత్తు పదార్థం సీజ్

కర్నూలు: కర్నూలు నగర శివారులో గంజాయి విక్రయిస్తున్న, సేవిస్తున్న వ్యక్తులను కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు అరెస్టు చేశారు. పక్కా సమాచారం మేరకు అర్బన్ తాలూకా సీఐ శ్రీరాం ఆధ్వర్యంలో జగన్నాథగట్టు ప్రాంతంలో మంగళవారం తనిఖీలు నిర్వహించి ఏడుగురు గంజాయి సరఫరాదారులను అదుపులోకి తీసుకున్నారు. హిందూపురం పట్టణానికి చెందిన రోహిత్, మునగాలపాడుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ లోకేష్, కర్నూలుకు చెందిన చిన్న, కల్లూరుకు చెందిన సి.నరసింహులు, పంచలింగాలకు చెందిన మీనిగ నరేందర్, ప్రకాశం జిల్లా బొమ్మలాపురంకు చెందిన లక్ష్మీనారాయణ, డి.ప్రభుదాసు తదితరులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 25 కేజీల గంజాయి, 25 గ్రాముల ఎండీఎంఏ మత్తు పదార్థాన్ని స్వాధీనం చేసుకున్నారు. రోహిత్ కర్నూలులో ఉంటూ అతని స్నేహితుడైన బ్రో అలియాస్ మనోహర్ ద్వారా ఈ దందా నిర్వహిస్తున్నట్లు పోలీసు విచారణలో బయటపడింది. ఇదిలాఉంటే మత్తుకు అలవాటు పడి గంజాయి సేవిస్తున్న మరో 24 మందిని కూడా అరెస్టు చేసి వారి వద్ద నుంచి రెండు కేజీల 780 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

నేడు వాహనాల వేలం

హిందూపురం అర్బన్: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (సెబ్) తనిఖీల్లో పట్టుబడిన వాహనాలకు బుధవారం వేలంపాట నిర్వహిస్తున్నట్లు సెబ్ సీఐ స్వర్ణలత తెలిపారు. ఉదయం 11 గంటలకు సబ్ కార్యాలయం వద్ద వేలంపాట జరుగుతుందన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

పెనుకొండ: పట్టణంలోని 15, 16 వార్డుల్లో బుధవారం మధ్యాహ్నం 2.30 గంటలకు ఎమ్మెల్యే శంకరనారాయణ ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ బోయ నరసింహ తెలిపారు.

పోలీసుల అదుపులో గొర్రెల దొంగలు?

మడకశిర: మడకశిర ప్రాంతంలో సంచలనం సృష్టించిన గొర్రెల చోరీ కేసును పోలీసులు ఛేదించినట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే... గుడిబండ మండలానికి చెందిన వ్యక్తి తన 30 గొర్రెలను మేత కోసం మడకశిర మండలం బుళ్లసముద్రం వద్దకు తోలుకొచ్చారు. శనివారం రాత్రి పథకం ప్రకారం అన్ని గొర్రెలను దొంగలు చోరీ చేశారు. ఈ నేపథ్యంలో బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వెంటనే స్థానిక ఎస్ఐ లోకేశ్ రంగంలోకి దిగి ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. మడకశిర మండలానికి చెందిన ఇద్దరు, రొద్దం మండలానికి చెందిన నలుగురు దొంగలు గొర్రెలను చోరీ చేసినట్లు తెలుస్తోంది. మడకశిర మండలానికి చెందిన ఇద్దరు దొంగలను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.

జూదరుల అరెస్ట్

మడకశిర: మండలంలోని కల్లుమర్రి వద్ద మంగళవారం రాత్రి జూద కేంద్రంపై దాడి చేసి నలుగురు జూదరులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ లోకేశ్ తెలిపారు. వారి నుంచి రూ.19,590 నగదు, 5 సెల్‌ఫోన్లు, 6 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశామన్నారు.

నిల్వ ఉంచిన ఇసుక సీజ్

అమరాపురం: మండల పరిధిలోని వి.అగ్రహారం గ్రామానికి చెందిన కాంతరాజు తన పొలంలో అక్రమంగా నిల్వ చేసుకున్న 12 ట్రాక్టర్ల ఇసుకను మంగళవారం ఎస్ఐ వెంకటేశ్వర్లు వీఆర్వో సమక్షంలో సీజ్ చేసినట్లు సెబ్ సీఐ భార్గవరెడ్డి తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పావగడలో దంచి కొట్టిన వాన



పావగడ: పట్టణంలో మంగళవారం సాయంత్రం వాన దంచి కొట్టింది. దీంతో పలు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఇది వరకు ఎన్నడూ ఇలాంటి వాన కురవలేదని స్థానికులు తెలిపారు. పంటల సాగుకు ఎంతో ఉపయోగమని రైతులు పేర్కొన్నారు.

ఆలయ భూముల్లో బోర్డుల ఏర్పాటు

హిందూపురం: పట్టణంలోని నానెప్ప సత్రం అనంత పద్మనాభస్వామి దేవాలయానికి సంబంధించి సత్యనారాయణ పేటలో ఉన్న భూముల్లో దేవదాయశాఖ ఏర్పాటు చేసిన బోర్డును కొందరు తొలగించారు. దీంతో ఆలయ ఈఓ నాగేంద్రుడు తిరిగి మరోబోర్డు ఏర్పాటు చేయించి ఆలయ భూముల్లో ఎవరైనా ఆక్రమంగా ప్రవేశిస్తే చట్టరీత్యాచర్యలు తీసుకుంటామని తెలిపారు.

ముందస్తు అరెస్టు

హిందూపురం టౌన్: చలో విజయవాడ కార్యక్రమంలో భాగంగా విజయవాడకు వెళ్లడానికి సిద్ధమైన ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, ఫక్రుద్దీన్‌లను మంగళవారం రాత్రి వన్‌టౌన్ పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. వారు మాట్లాడుతూ ముందస్తు అరెస్టు చేసి నోటీసులు ఇవ్వడం సరికాదన్నారు.

ఉప ఎన్నిక సందడి

హిందూపురం అర్బన్: మండలంలోని చలివెందుల పంచాయతీ ఉప ఎన్నికల ప్రక్రియ మంగళవారం మొదలు కావడంతో గ్రామంలో ఎన్నికల సందడి మొదలైంది. ఎవరిని బరిలోకి దింపితే విజయం సాధిస్తారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త దీపిక ఇప్పటికే రూరల్ మండల నాయకులతో ఆరా తీశారు. మిగతా పార్టీల వారు కూడా అభ్యర్థుల అన్వేషణలో ఉన్నారు.

నిధులు సొంతంగా సమకూర్చుకోవాలి

గుడిబండ: పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులు పంచాయతీకి సొంతంగా నిధులు వచ్చే వనరులు ఏర్పాటు చేసుకోవాలని స్వచ్ఛ భారత్ కేంద్ర పరిశీలకులు వెంకటేష్, జిల్లా స్వచ్ఛ భారత్ కోఆర్డినేటర్ శ్రీనివాసులు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని రాళ్లపల్లి పంచాయతీలో ఉన్న చెత్తతో సంపద కేంద్రాన్ని వారు తనిఖీ చేశారు.

తల్లి పాలు బిడ్డకు దివ్య ఔషధం

మడకశిరరూరల్: తల్లిపాలు పిల్లలకు దివ్య ఔషధమని, పుట్టిన బిడ్డకు ముర్రిపాలు తాగించడం వల్ల వారిలో రోగనిరోధక శక్తి పెరుగుతుందని సీడీపీఓ నాగమల్లేశ్వరి తెలిపారు. గుండుమల అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం మెళవాయి సెక్టర్ తల్లి పాలు వారోత్సవాలు నిర్వహించారు. తల్లిపాల ప్రాముఖ్యత, 108 సేవలు, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

ఓబీసీ సమావేశాన్ని విజయవంతం చేయాలి

మడకశిర: తుమకూరులో ఈనెల 13న జరగనున్న కుంచిటి వక్కలిగలకు సంబంధించిన ఓబీసీ సమావేశాన్ని విజయవంతం చేయాలని అఖిల కుంచిటి మహా మండల అధ్యక్షుడు రంగహనుమయ్య పిలుపునిచ్చారు. పట్టణంలోని బేగార్లపల్లి క్రాస్‌లో ఉన్న వక్కలిగ సంఘం భవనంలో మంగళవారం కార్యవర్గ సభ్యులు సమావేశమై చర్చించారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు అనంతరాజు, పదాధికారులు పాల్గొన్నారు.

నేడు గవర్నర్‌తో భేటీ కానున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్‌నజీర్‌తో బుధవారం విజయవాడలోని రాజభవన్‌లో ఎమ్మెల్యే తిప్పేస్వామి భేటీ కానున్నారు. బుధవారం సాయంత్రం 5 గంటలకు గవర్నర్ అపాయింట్‌మెంట్ ఇచ్చినట్లు ఎమ్మెల్యే 'సాక్షి'కి తెలిపారు. గవర్నర్‌కు హేమావతి సిద్ధేశ్వరస్వామి, రత్నగిరి, భక్తరహళ్లి తదితర దేవాలయాల ప్రాముఖ్యతను వివరించనున్నట్లు పేర్కొన్నారు.

నలుగురికి గాయాలు

గోరంట్ల: స్థానిక విజయ్‌కుమార్ పెట్రోల్ బంక్ సమీపంలో కదిరి -హిందూపురం ప్రధాన రోడ్డుపై మంగళవారం రాత్రి రెండు ద్విచక్ర వాహనలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో అనంతపురానికి చెందిన రజాక్, ప్రణయలహరి, అబు, వాసు అనే వ్యక్తులు గాయపడ్డారు. వాసు పరిస్థితి విషమంగా ఉండటంతో హిందూపురం ఆస్పత్రికి, మిగతా వారిని గోరంట్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు.